క్లుప్తంగా

ప్రభుత్వం కక్ష సాధింపునకు రేపటి నుంచి ఏపీటీఎఫ్ నిరసన

పమిడిముక్కల: రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపులకు నిరసనగా ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిరసనవారం చేపట్టాలని ఏపీటీఎఫ్ పిలుపునిచ్చిందని ఆ సంఘ మండల అధ్యక్షుడు వీరంకి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి, ఐఆర్ ప్రకటించాలని పేర్కొన్నారు. యాప్‌లను, అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వాల్‌పోస్టర్, కరపత్రం విడుదల చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు బి.సతీష్‌కుమార్, ఎ.వెంకటేశ్వరరావు, గిరిధర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై దాణా పంపిణీ

పెద్దమద్దాలి(పామర్రు): పామర్రు మండల పరిధిలోని పెద్దమద్దాలిలో మంగళవారం రైతులకు 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిజెస్సీ శాంతకుమారి, బల్లిపర్రు గ్రామ సర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్ పాల్గొని 24 మంది పాడి రైతులకు 1.2 టన్నుల పశువుల దాణా ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముదునూరు శివకృష్ణ, నిమ్మకూరు పశువైద్యాధికారి ఎం. మౌర్య సత్యేందర్, మండల పశువైద్యాధికారి డాక్టర్ డీ సృజన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణ

గుడ్లవల్లేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్లో మంగళవారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ 1.0, ట్రాన్సిషన్ టు పీఏఐ 2.0 పై మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ కొడాలి సురేష్, వివిధ లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్‌లో పంచాయతీల ప్రగతి, సాధించాల్సిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను తెలియపరచి వివిధ లైన్ డిపార్ట్‌మెంట్లకు సంబంధించిన డేటాను సేకరించి పి.ఎ.ఐ పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని శిక్షకులు పేర్కొన్నారు.

పొదుపు, అప్పలను పర్యవేక్షించాలి

పామర్రు(మొవ్వ): ప్రతి స్వయం సహాయక సంఘంలో ఎంత పొదుపు ఉంది, సంఘ సభ్యులు ఎంత అప్పు తీసుకున్నారు, ఏయే రుణాలు తీసుకుంటున్నారు అనే అంశాలను అధికారులు పర్యవేక్షించాలని డీఆర్‌డీఏ పీడీ హరహరనాథ్ సూచించారు. మంగళవారం పామర్రులోని మహిళా సమైఖ్య కార్యాయలంలో వెలుగు–సెర్ప్ ఆధ్వర్యంలో మనడబ్బు–మనలెక్కలు, లోకోస్, ఎంసీఎల్ఎఫ్‌ల పై ఒక శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. డీపీఎం పీడీ సత్యభామ, డీసీఎం ఎల్‌హెచ్ సుధాకర్, ఏజీఎం మునీంద్ర, డీపీఎం మధు, ఏపీఎం తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరుకు తరలిన కార్యకర్తలు



కైకలూరు: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఏలూరులో జరిగిన అన్నదాత పోరుకు ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయానికి ఉదయమే నాలుగు మండలాల కార్యకర్తలు చేరుకున్నారు. అక్కడ నుంచి వాహనాల్లో వెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగ జాయింట్ సెక్రటరీ ఐనాల బ్రహ్మాజీ రావు, బీసీ సెల్ సెక్రటరీ బలే నారరాజు, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బీవీ.రావు, ఏలూరు జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షుడు దుగ్గిరాల నాగు, జిల్లా రైతు విభాగ కమిటీ జనరల్ సెక్రటరీ రామారావు, వివిధ విభాగాల నాయకులు రాము, రవికుమార్, బేబీ, ఏసుబాబు, అంజి, ఏసుకుమార్, నాగు, రాజు తరలివెళ్లారు.

ఘనంగా త్రిపురనేని జయంతి

గుడివాడరూరల్: సామాజిక సమస్యల ఇతివృత్తమే స్వర్గీయ త్రిపురనేని గోపిచంద్ రచనలని గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్ఎస్ఎస్‌వీ రామాంజనేయులు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణమందిరంలో తెలుగు భాష వికాస సమితి ఆధ్వర్యంలో త్రిపురనేని జయంతి మంగళవారం నిర్వహించారు. తొలుత త్రిపురనేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ సోమసుందరరావు, తెలుగు భాష సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, వాసవి జాగృతి అధ్యక్షుడు ఎస్‌వీ ప్రసాద్, మహిళా నేత ఎన్.విజయలక్ష్మి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు.

శరత్‌బాబుకు త్రిపురనేని పురస్కారం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల్లోని ఆంగ్ల మాధ్యమం అధ్యాపకుడు కొడాలి శరత్‌బాబుకు త్రిపురనేని గోపీచంద్ సాహితీ స్ఫూర్తి పురస్కారం లభించింది. ఈ విషయాన్ని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. త్రిపురనేని గోపీచంద్ జయంతిని పురస్కరించుకుని శరత్‌బాబుకు ఆయన పురస్కారాన్ని గుడివాడలో సోమవారం అందించారని పేర్కొన్నారు.

అన్నదాత పోరుకు

కదం తొక్కిన రైతులు

- రైతులకు అండగా వైఎస్సార్ సీపీ పోరుబాట
- చంద్రబాబు పాలనలో రైతులకు కష్టాలే

జిల్లాలో యూరియా కొరత, ఎరువులను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కూటమి కూటమి ప్రభుత్వ పనితీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ మంగళవారం 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరై కదం తొక్కారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు.

గుడివాడరూరల్: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులకు కష్టాలే అని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. యూరియా కొరత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు. గుడివాడలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శాంతియుతంగా ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపేందుకు వచ్చారు.

అడ్డుకున్న పోలీసులు

యూరియా కొరత, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓకు వినతిపత్రం అందజేసేందుకు కార్యాలయంలోకి వెళుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులను పోలీసులు అడ్డుకున్నారు. స్వల్ప వివాదం అనంతరం ముఖ్య నాయకులను, రైతులను కార్యాలయంలోకి పోలీసులు అనుమతించారు. ఆర్డీఓ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ ఏఓ బాలాజీకి వినతి పత్రాన్ని అందజేశారు. గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ మీడియాతో మాట్లాడారు. యూరియా, ఎరువుల కోసం రైతులు గత కొన్ని నెలలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి, ఇతర మంత్రులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతాంగ సంక్షేమమే ధ్యేయమని చెప్పే చంద్రబాబు ఇప్పుడు రైతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లోనే అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించామన్నారు. నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చి పూర్తిగా నిర్వీర్యం చేయడం అన్యాయమన్నారు. సీఎం చంద్రబాబు ఎక్కడా యూరియా కొరత లేదని చెప్పడం సరికాదన్నారు.



గుడివాడ ఆర్డీఓ కార్యాలయం లోపల ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గుడివాడ ఆర్డీఓ కార్యాలయంలోకి వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కూటమి ప్రభుత్వం విఫలం

గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్ రాణి, వైఎస్సార్ సీపీ స్టీరింగ్ కమిటీ నాయకుడు దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, రైతు సంఘం కన్వీనర్ పెన్నేరు ప్రభాకరరావు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పట్టెడన్నం పెట్టే రైతులకు ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఎరువులు, యూరియా కోసం ప్రతి రోజు రైతులు క్యూలో నిలబడి పడిగాపులు కాస్తున్నా ప్రభుత్వం, మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రోజంతా యూరియా కోసం క్యూలో నిలబడి పడిగాపులు పడాల్సిన దుస్థితిలో రైతన్నలు ఉన్నారని విమర్శించారు. యూరియాతో సహా ఎరువులన్నీ డిమాండ్‌కు మించి ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి కన్పించడం లేదని ఎద్దేవా చేశారు. వ్యవసాయం దండగ అన్న వ్యక్తి సీఎం చంద్రబాబు అని పేర్కొన్నారు. రైతుల కోసం పోరాటాలు చేస్తున్న ప్రతిపక్షాలను బెదిరింపులకు గురి చేయడం ఆయనకు సరికాదన్నారు. ఇప్పటికైనా యూరియాతో పాటు రైతాంగ సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతులతో కలసి పోరాడేందుకు తాము సిద్ధమని హెచ్చరించారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, గుడివాడ జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు చిన్ని సత్యదుర్గాప్రసాద్, గొర్ల శ్రీను, నాయకులు ఇమ్మడి అశోక్ , తేట్ల వీరయ్య, కందుల నాగరాజు, పాలేటి చంటి, కోటప్రోలు నాగు, కొంకితల ఆంజనేయులు, చుండూరు శేఖర్, కలపాల కిరణ్, శాయిన నాగబాబు, అడబాల అప్పారావు, పుల్లేటికుర్తి కృష్ణారావు, బాజీ, షమ్ము, కరీముల్లా, సయ్యద్, జ్యోతుల సత్యవేణి, మాదాసు వెంకటలక్ష్మి, సురేఖ, రమీజా, హారిక, మూడెడ్ల ఉమా, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



యూరియా లేక తీవ్ర ఇబ్బందులు

కొన్ని రోజులుగా యూరియా లేక అల్లాడుతున్నాం. ఈ ఖరీఫ్ సాగులో ఒక్కసారి కూడా రైతులకు కావాల్సిన యూరియా, ఎరువులు సక్రమంగా అందించలేదు. వరిపైరు ప్రస్తుతం అదను దశలో ఉంది. ప్రభుత్వం మాత్రం అరకొరగా యూరియా సరఫరా చేస్తుంటే పంట దిగుబడి తగ్గి నష్టపోతామని భయంగా ఉంది. ఇప్పటికైనా మాకు కావాల్సిన యూరియాను వెంటనే ప్రభుత్వం అందించాలి.

– ఏలేటి ఆంజనేయులు, రైతు



గంటలు కొద్ది క్యూలో నిలబడాలి

యూరియా కోసం గంటల కొద్ది పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల వద్ద క్యూలో నిలబడితే అరకొరగా మాత్రమే యూరియా అందిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల రెకమండేషన్‌లు ఉంటే మాత్రం ఎంత కావాలంటే అంత ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తుంది. వెంటనే ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

– ఇమ్మడి అశోక్‌కుమార్, రైతు



యూరియా లభించడం లేదు

పంట చేతికి వచ్చే సమయంలో యూరియా కావాల్సినంత లభించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోనే రైతులకు కావాల్సిన యూరియా, విత్తనాలు, పురుగు మందులు అందించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం రైతులను పట్టించుకోవడం లేదు. యూరియా లేక ఇబ్బందులు పడుతుంటే ఎక్కడా ఏ ఇబ్బందులు లేవని ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పడం దారుణం. ఇప్పటికైనా స్పందించి రైతులకు కావాల్సిన మేర యూరియాను సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– చిన్ని సత్యదుర్గాప్రసాద్, రైతు



యూరియాను బ్లాక్‌లో కొనాల్సిన దుస్థితి

ప్రస్తుతం రైతులకు యూరియా అవసరం చాలా ఉంది. ఎరువులను ప్రైవేట్ షాపులకు ఇవ్వడం వలన వారు బ్లాక్ చేసి అధిక రేట్లకు విక్రయించి రైతులను దోచుకుంటున్నారు. బస్తా మీద రూ.200 నుంచి రూ.400 వరకు అధికంగా విక్రయిస్తున్నారు. అది కొనుగోలు చేస్తామని రైతులు ప్రయత్నించినా యూరియా లభించడం లేదు. దీంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి గతంలో మాదిరిగానే రైతుసేవా(భరోసా) కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయాలి.

– పెన్నేరు ప్రభాకరరావు, రైతు సంఘం కన్వీనర్, వడ్లమన్నాడు



అదును దాటుతున్నా యూరియా కొరత

అదును దాటుతున్నా యూరియా కొరత ఈ ప్రభుత్వంలో రైతులను వెంటాడుతోంది. జూలైలో వరి నాట్లు వేసిన రైతులు కూడా ప్రస్తుతం రెండో విడత ఎరువులు వేయాల్సి ఉంది. ఎరువుల కొరత కారణంగా అదును దాటిపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– డాక్టర్ తీట్ల వీరయ్య, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కార్యదర్శి



యూరియా అందించలేని కూటమి

యూరియా కొరత రైతులను వేధిస్తోంది. రైతులకు కనీసం యూరియా కూడా ఇవ్వలేని దయనీయ పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందా? రైతు ఎన్ని ఎకరాలు సాగు చేశారనే దాంతో సంబంధం లేకుండా అర బస్తాను మించి యూరియా ఇవ్వడం లేదు.

– శేషం గోపి, వడ్లమన్నాడు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు



కొందామంటే యూరియా ఏది?

గుడ్లవల్లేరు మండలంలోని ఏ ప్రాంతంలో రైతును అడిగినా కొనుగోలు చేద్దామంటే యూరియా లేదంటున్నారు. యూరియా లభించకపోవడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పంట పిలకలు వేసుకునే దశలో ఉంది. ఈ దశలో తప్పనిసరిగా యూరియా వేయాల్సి ఉంది.

– కోటప్రోలు నాగు, వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి



దోమ ఆశించే ప్రమాదం

అదును దాటిపోయాక యూరియా వేయడం వల్ల దోమ ఆశించే ప్రమాదం ఉంది. పంటకు కావాల్సిన యూరియా కోసం డీలర్లను బతిమాలి రూ.263 ఉన్న యూరియా బస్తాపై అదనంగా రూ.250నుంచి రూ.350 పెట్టి కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ ఇటువంటి యూరియా కొరత ఏర్పడలేదు.

– గుదే రవి, వైఎస్సార్ సీపీ గుడ్లవల్లేరు మండల యువజన అధ్యక్షుడు

యూరియా కొరతపై నిరసన గళం



మాట్లాడుతున్న పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఉయ్యూరు: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలకు చెందిన రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద శాంతియుతంగా ఆందోళన చేశారు. ఉయ్యూరు బైపాస్ సెంటరు నుంచి పాదయాత్రగా మార్కెట్ యార్డుకు చేరుకున్న పార్టీ శ్రేణులు రైతులు యూరియా కొరతపై నిరసన గళం విప్పారు.

రైతుగోడు పట్టించుకోని కూటమి

కూటమి ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోవటం లేదని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. అన్నదాత పోరు ఆందోళనలో భాగంగా ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద అనిల్‌కుమార్ మాట్లాడుతూ రెండు నెలలుగా యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు ఇబ్బంది లేని విధంగా విత్తనాలు, ఎరువులు సరఫరా అయ్యాయన్నారు. వైఎస్సార్ రైతులకు అండగా విధానాలు తీసుకొస్తే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాత పాలన సాగించారని గుర్తు చేశారు. యూరియా గురించి అడిగితే చంద్రబాబు బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న మోసాలపై ప్రజలు తిరగబడే రోజులు ముందున్నాయన్నారు. లంకపల్లిలో రీసర్వే పేరుతో భూములను దోచుకునేందుకు కూటమి నేతలు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. 600 ఎకరాలను కాజేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పామర్రు నియోజకవర్గంలో రోజుకు రూ.70 లక్షలు ఇసుక దోచేస్తున్నారని, ఆ సొమ్ము ఎవరి జేబులోకి వెళ్తుందని ప్రశ్నించారు. ఆఖరికి రేషన్ బియ్యంలోనూ ఎమ్మెల్యేలు కిలోకు రూ.4 వాటా తీసుకుంటున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే అక్రమాలను నిలువరించాలని, రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యూరియాను అర్ధరాత్రి తరలించాల్సిన అవసరం ఏముంది?



యలమర్రులో ఆందోళన చేస్తున్న రైతులు

యలమర్రు(పెదపారుపూడి): పీఏసీఎస్ బ్యాంక్‌లో ఉన్న యూరియా బస్తాలను ట్రాక్టర్లలో రాత్రి సమయంలో తరలించాల్సిన అవసరం ఏముందని యలమర్రుకు చెందిన రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని యలమర్రు ఎస్సీ కాలనీలో యూరియా తరలింపుపై రైతులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు తమ్మపూడి ఏలిషా మాట్లాడుతూ స్థానిక పీఏసీఎస్‌కు సుమారు 320 యూరియా బస్తాలు వచ్చినట్లు అధికారులు తెలిపారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచి రైతులకు పట్టాదారు పుస్తకాలు జిరాక్స్ తీసుకుని ఒక బస్తా చొప్పున ఇచ్చారన్నారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో బ్యాంక్‌లో ట్రాక్టర్ పెట్టి సుమారు 50పైగా యూరియా బస్తాలు తరలిస్తున్నట్లు సమాచారం రావటంతో అక్కడకు వెళ్లి సొసైటీ అధికారులను నిలదీశామన్నారు. దీంతో యూరియా బస్తాలను మళ్లీ లోపల పెట్టారని పేర్కొన్నారు. పోలీసులు వచ్చి రైతులను పంపించి వేశారన్నారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తమ్మపూడి అనిల్, దినేష్, తుమ్మపూడి ఏసురత్నం, కొడాలి సాయేలు, కాటూరి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల పరిషత్ సమావేశం



ఎంపీపీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

ముదినేపల్లి రూరల్: ప్రజాప్రతినిధులపై తహసీల్దార్ నిర్లక్ష్య వ్యాఖ్యలు చేయడంతో ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం రసాభాసగా మారింది. తహసీల్దార్ క్షమాపణ చెప్పాలంటూ ప్రజాప్రతినిధులు సమావేశానికి బహిష్కరించి ఆందోళనకు దిగారు. మంగళవారం ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. రెవెన్యూ శాఖకు సంబంధించి సర్పంచ్‌లు సమస్యలు లేవనెత్తే సరికి తహసీల్దార్ లతీఫ్‌బాషాకు ఎక్కడలేని ఆగ్రహం వచ్చింది. ఈ శాఖకు సంబంధించి తొలుత చినకామనపూడి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య తమ గ్రామానికి సంబంధించిన ఊరచెరువు సర్వే సమస్య గురించి లేవనెత్తారు. చెరువు సర్వే చేపట్టి ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం సర్వే చేయకుండానే చేసినట్లు తమకు సమాచారం ఇచ్చారు. దీంతో పాటు చెరువుతో సంబంధం లేని పంచాయతీ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇందుకు తహసీల్దార్ అస్పష్టమైన సమాధానం ఇచ్చారు. అనంతరం కొరగుంటపాలెం సర్పంచ్ రామకృష్ణ తమ గ్రామంలో పంచాయతీ భూములు సైతం ఆక్రమణకు గురయ్యాయంటూ తహసీల్దార్ దృష్టికి తీసుకురాగానే సరైన సమాధానం ఇవ్వకుండా సర్పంచ్‌లను కించపరిచేవిధంగా వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆగ్రహించిన శ్రీహరిపురం సర్పంచ్ విశ్వేశ్వరరావు తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో తహసీల్దార్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎంపీపీ రామిశెట్టితో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ తహసీల్దార్ వ్యాఖ్యలకు నిరసనగా సభ్యులంతా సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. జరిగిన ఘటనకు బాధ్యత వహిస్తూ బేషరతుగా తహసీల్దార్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు గంటల పాటు ఈ నిరసన ప్రదర్శన జరగ్గా ఎట్టకేలకు తహసీల్దార్ దిగొచ్చారు. తన మాటలను అపార్థం చేసుకున్నారని తన కెలాంటి దురుద్దేశం లేదని జరిగిన ఘటనకు చింతిస్తున్నానంటూ తెలపడంతో నిరసన విరమించారు.

యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

నందివాడ: యూరియా కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. మంగళవారం జనార్ధనపురం (జొన్నపాడు)లో యూరియా కోసం బారులు తీరారు. రైతులు వేకువజాము నుంచే క్యూలో ఉండి పడిగాపులు కాశారు. యూరియాను సరైన సమయానికి ఇచ్చే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని రైతులు విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు ఎలాంటి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో యూరియా కోసం గంటల తరబడి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి

మొవ్వ: మండలంలో ప్రతి గ్రామాన్ని పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గల గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, దానికి అందరూ సహకరించాలని ఎంపీడీఓ సుహాసిని పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రేడ్ వన్, గ్రేడ్ ఫైవ్ కార్యదర్శులకు పంచాయతీ ప్రణాళికల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఏఓ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ వి.ప్రభు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసినవారికి శిక్ష తప్పదు



దానిగూడెం దళితవాడలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: దానిగూడెం దళితులపై దాడి చేసిన నిందితులు శిక్ష నుంచి తప్పించుకోలేరని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. వినాయక విగ్రహ ఊరేగింపులో దానిగూడెంకు చెందిన ఇద్దరు యువకులపై కత్తులతో దాడి జరిగిన ఘటనకు సంబంధించి బాధిత కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇకపై ఇటువంటి గొడవలు లేకుండా పూర్తి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. గ్రామంలో కొందరు దళితులు గొడవకు ప్రధాన సూత్రధారి కొల్లి బాబీని అరెస్టు చేయాలని కోరగా పోలీసులు విచారించి చర్యలు తీసుకుంటారన్నారు. గ్రామానికి రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని దానిగూడెం ప్రజలు కోరారు. ఎమ్మెల్యే స్పందించి ఎంపీ నిధులతో కమ్యూనిటీ హాలు, నరేగా నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, తాత్కాలిక సర్పంచ్ కేవీఎస్ఎం.నాయుడు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.